సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 1 । ఆగస్టు । 2024



సోమశిలలో 9.496 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 9.496 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.71,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,415
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,607
నవర (8 గ్రాములు)	రూ.52,856

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5 /29.4

గాలిలో తేమ 51 శాతంగా బుధవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం గురువారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పలువురు డీఎస్పీల బదిలీలు



నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు



నూతన ఎస్‌బి డీఎస్పీ అత్తిన శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి డీజీ కార్యాలయ అటాచ్‌లో ఉండగా ఆయనను ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న ఘట్టమనేని శ్రీనివాసరావును నియమించారు. నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్ల శ్రీనివాసులు అనంతపురం జిల్లా పెనుకొండ డీఎస్పీగా, నెల్లూరు సీసీఎస్ డీఎస్పీగా పనిచేస్తున్న పి.రామకృష్ణాచారిని తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీగా బదిలీచేశారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ సీహెచ్ విజయభాస్కర్‌రావు పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు డీఎస్పీగా పనిచేస్తున్న అత్తిన శ్రీనివాసరావు నెల్లూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీగా వస్తున్నారు.

సీఐల బదిలీలు కూడా..

నెల్లూరు (క్రైమ్): పలువురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు. కె.అజయ్‌కుమార్ (ప్రస్తుతం మహిళా పీఎస్-2) ఒంగోలు తాలుకా పీఎస్‌కు బదిలీ అయ్యారు. పి.వెంకటనారాయణ (వేదాయపాలెం) కలిగిరి సర్కిల్‌కు, ఎండీ ఫిరోజ్ (కలిగిరి సర్కిల్) రేంజ్ వీఆర్‌కు, బి.అశోక్‌కుమార్ (చిన్నబజారు పీఎస్) రేంజ్ వీఆర్‌కు, సీహెచ్ కోటేశ్వరరావు (సీసీఎస్, నెల్లూరు) చిన్నబజార్ పీఎస్‌కు, టి.విజయ్‌కృష్ణ (సీసీఎస్, ఒంగోలు) రాపూరు సర్కిల్‌కు, పి.సుబ్బారావు (రేంజ్ వీఆర్) వెంకటాచలసత్రం సర్కిల్‌కు బదిలీ అయ్యారు.

అటవీశాఖ రేంజర్‌గా మాల్యాద్రి



మాల్యాద్రి

నెల్లూరు (అర్బన్): నెల్లూరు డివిజన్ అటవీశాఖ రేంజర్‌గా మాల్యాద్రి బుధవారం వేదాయపాళెంలోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు డిప్యూటీ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతిపై ప్రభుత్వం ఆయనను రేంజర్‌గా నియమించింది.

రెండు యూనిట్లలో ఉత్పత్తికి బ్రేక్

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. ఇందులో భాగంగా రెండో యూనిట్లో 405 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాల వల్ల 1, 3వ యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది.

డంపింగ్ ఇసుక జంపింగ్

అక్రమంగా తరలిస్తున్న పచ్చ నేతలు

- మర్రిపాడు యార్డులో ఇసుక మాఫియా హవా
- ఒక్కో టిప్పరుకు 40 టన్నుల వరకు లోడింగ్
- నిత్యం నలభై వాహనాలలో చెన్నై తరలింపు
- మినగల్లు డంపింగ్ యార్డులో 12 వేల టన్నులు మాయం
- మైనింగ్, పోలీసు, సెబ్, రెవెన్యూ సిబ్బందికి మామూళ్లు

'మంత్రులు, ఎమ్మెల్యేలు ఇసుక జోలికి పోవద్దు. ఉచిత ఇసుకపై విధివిధానాలు ఇంకా రూపొందించలేదు. ఎవరూ కూడా ఇసుక విషయంలో తలదూర్చొద్దు' ఇదీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఇచ్చిన ఆదేశాలు. కానీ జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం ఇసుక మాఫియా చేసే దోపిడీకి సహకరిస్తూ వాటాలు పుచ్చుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేవు. అందువల్ల రీచ్‌లు ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వం రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డంపింగ్ యార్డుల్లో నిల్వ ఉంచిన ఇసుక ప్రస్తుతం అక్రమార్కులు విక్రయించి దోచేస్తున్నారు. జిల్లా అవసరాలకు కాదని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. డంపింగ్ యార్డులో ఇసుక దొంగలతో మైనింగ్, రెవెన్యూ, సెబ్, పోలీసు అధికారులు భాగస్వాములై మామూళ్లు పుచ్చుకుంటున్నారు.

మర్రిపాడు డంపింగ్ యార్డులో..

మర్రిపాడు డంపింగ్ యార్డులో గత ప్రభుత్వం 2.51 లక్షల టన్నుల ఇసుకను డంపింగ్ చేసి ఉంచింది. ప్రభుత్వం మార్పుతోనే ఆ డంపింగ్ యార్డుపై పచ్చనేతల కన్ను పడింది. పొదలకూరు మండలం సూరాయపాళెం, బుచ్చి మండలం కాగులపాడుకు చెందిన ఇద్దరు ఇసుక మాఫియా డాన్‌లు ఆ ఇసుక అక్రమ రవాణా కోసం స్థానిక పచ్చనేతలను ఆశ్రయించగా వారు రూ.2.4 కోట్లు పుచ్చుకొని సరేనన్నారు. అంతే అనధికారికంగా 1.30 లక్షల టన్నుల ఇసుకను మాఫియా తరలించి సొమ్ము చేసుకుంది. వారం రోజుల పాటు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించి రూ.5 కోట్ల వరకు జేబుల్లో నింపుకుంది. మర్రిపాడులో ఇసుకాసురుల దోపిడీ వైనం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో వారు స్థానిక టీడీపీ నేతలకు అక్షింతలు వేశారని తెలిసింది. దీంతో ఆ డంపింగ్ యార్డులో ఇసుక ఎంతమేర నిల్వ ఉండేది పరిశీలించగా కేవలం 1.21 లక్షల టన్నులే ఉన్నట్లు గుర్తించారు. దానిని రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని పెట్టి విక్రయాలు జరిగేలా చేశారు. టన్ను రూ.370 వంతున ఒక్కో వాహనానికి 20 టన్నుల వరకు పరిమితి చేశారు. కానీ మర్రిపాడు డంపింగ్ యార్డును ఆ మాఫియా తమ ఆధీనంలోనే ఉంచుకుని అక్కడ లోడింగ్ వాహనాలను కూడా వారే సమకూర్చి అక్రమ రవాణా సాగిస్తున్నారు. అధికారికంగా 20 టన్నులకు రశీదు చూపించి 12 టైర్ల వాహనాలకు 40 టన్నుల ఇసుకను లోడింగ్ చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిత్యం ఆ ఇద్దరు మాఫియా లీడర్లకు చెందిన 12 టైర్లు ఉన్న వాహనాలకు మాత్రం 40 టన్నుల ఇసుక లోడింగ్ జరుగుతోంది. ఇలా నిత్యం 800 టన్నుల ఇసుక అనధికారికంగా తరలివెళ్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూస్తే అనధికారికంగా తరలివెళ్లే ఇసుక నుంచి రోజువారీగా రూ.2.9 లక్షల వరకు మాఫియాకు వారికి సహకరించిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులకు ముడుతోంది.



ఇసుక లోడ్‌తో తరలింపునకు సిద్ధంగా ఉన్న లారీలు



మర్రిపాడు డంపింగ్ యార్డులో పరిమితికి మించి ఇసుక లోడింగ్

మర్రిపాడు వయా చెన్నై..

ఇసుకాసురులు బరితెగించి స్థానిక అవసరాలకు కాదని ఇసుకను చెన్నై నగరానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మర్రిపాడు నుంచి సూరాయపాళెం, కాగులపాడుకు చెందిన ఇద్దరు ఇసుక మాఫియా నేతల ఆధ్వర్యంలో ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. దాదాపు 40 వాహనాలతో ఇసుక తరలింపు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 12 టైర్లు ఉన్న పెద్ద టిప్పర్లు, లారీలతో పరిమితికి మించి 40 టన్నుల ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెన్నై నగరంలో 40 టన్నుల ఇసుకను అన్‌లోడ్ చేస్తే రూ.1.10 లక్షల వరకు ముడుతోంది. దీంతో అక్రమార్కులు స్థానిక ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై పోలీసు, సెబ్, మైనింగ్, ఆర్టీవో అధికారులకు నెలవారీ మామూళ్లు ఇచ్చుకుంటూ ఇసుక లారీలను బయట రాష్ట్రాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అదనపు వసూళ్లు

మర్రిపాడు డంపింగ్ యార్డులో ప్రతి వాహనం వద్ద అక్కడ సిబ్బంది అదనపు వసూళ్లు చేస్తున్నారు. లోడింగ్ చేసే వాళ్లకు రూ.200, అక్కడ సిబ్బందికి అదనంగా రూ.1000 వంతున ఇస్తేనే లోడింగ్ ముందుగా చేస్తారు. నగదు ఇవ్వని వాహనదారులకు మాత్రం క్యూలైన్‌లో ఉంచి రెండు రోజులకుగాని లోడింగ్ చేసే పరిస్థితి లేదన్న ఆరోపణలున్నాయి.

మినగల్లులో 12 వేల టన్నుల ఇసుక మాయం

కోవూరు నియోజకవర్గం పరిధిలో ఉండే మినగల్లు ఇసుక డంపింగ్ యార్డులో పచ్చ దొంగలు పడ్డారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 12 వేల టన్నుల ఇసుకను దోచుకున్నారు. వాస్తవ గణాంకాల ప్రకారం దాదాపు లక్ష టన్నులను ఇసుకాసురులు అక్రమ రవాణా చేసుకుని రూ.3.7 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారు. కానీ మైనింగ్ అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం 12 వేల టన్నుల ఇసుక అంటే రూ.45 లక్షల విలువైన ప్రజాధనం స్వాహా చేశారని చెప్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారి నుంచి పోలీసులు, సెబ్, మైనింగ్ అధికారులు ఈ అవినీతిలో భాగస్వాములైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ రెవెన్యూ అధికారికి ఇసుక మాఫియా నూతన కారును సమకూర్చిందన్న ఆరోపణలున్నాయి.

పల్లిపాడులోనూ కాకిలెక్కలే..

ఇందుకూరుపేట మండలం పల్లిపాడు డంపింగ్ యార్డులో 8 వేల టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు మైనింగ్ అధికారులు గణాంకాలు చూపారు. వాస్తవానికి అక్కడ దాదాపు 35 వేల టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు గత ప్రభుత్వంలో గణాంకాలు తేల్చాయి. కానీ స్థానిక పచ్చనేతలు, ఇసుకాసురులతో కలిసి ఎన్నికల ఫలితాల మరుసటి రోజు నుంచే ఇసుక అక్రమ రవాణా చేశారు. ఎట్టకేలకు 8 వేల టన్నులు లెక్కలు చూపించి విక్రయాలు చేశారు. పల్లిపాడులో ఉన్న ఇసుక నిల్వల కంటే అదనంగా 40 టన్నులు ఇసుక విక్రయాలు చేసినట్లు చూపారు. అదనంగా ఎలా వచ్చిందో అధికారులకే తెలియాలి.

చర్యలు తీసుకుంటాం

మర్రిపాడు ఇసుక డంపింగ్ యార్డులో అనధికార లోడింగ్ విషయంపై విచారించి చర్యలు తీసుకుంటాం. మినగల్లు డంపింగ్ యార్డులో 12 వేల టన్నుల ఇసుక మాయం అయింది వాస్తవమే. ఇసుక మాయంపై విచారణ జరిపిస్తున్నాం. అందులో ప్రమేయమున్న వారందరిపై కేసులు నమోదు చేయిస్తాం.

– శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ, నెల్లూరు

లోడు ఖమ్మం వెళ్లాలి



తెలంగాణలోని ఖమ్మం దగ్గర ప్రాంతాలకు ఇసుక తోలేందుకు లారీ తీసుకొని వచ్చా. ఈ ప్రాంతం వారు ఇక్కడ మమ్మల్ని శాశిస్తున్నారు. రాత్రి నుంచి పడిగాపులు పడితే మరురోజు సాయంత్రానికీ ఇసుక లోడ్ కాలేదు. అయినా ఓపిగ్గా వెయిట్ చేస్తున్నాం. టన్నుకు రూ.370 చొప్పున తీసుకుంటున్నారు. – రామకృష్ణ, లారీ డ్రైవర్, ఖమ్మం

దూరప్రాంతాల నుంచి వచ్చాం



మా సమీప జిల్లాలో ఎక్కడా ఇసుక డంప్ యార్డులు లేవు. దీంతో మర్రిపాడు యార్డు దగ్గరికి వచ్చాం. దూరం కావడం, ఇక్కడ లోడ్ చేయడం ఆలస్యం అవుతుండడంతో మూడు రోజులకు ఒక ట్రిప్పు మాత్రమే వస్తుంది. అధికారులు ఇక్కడి పరిస్థితి పరిశీలించి త్వరగా లారీలకు లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మున్నా, లారీ డ్రైవర్, నంద్యాల జిల్లా

లారీలు అధికంగా వస్తున్నాయ్



మాది వైఎస్సార్ జిల్లా బద్వేల్. మర్రిపాడు మాకు దగ్గరే. అయినా ఇసుక లోడ్ చేసుకొని ఆర్డర్ మేరకు డెలివరీ ఇవ్వడానికి ఆలస్యమవుతోంది. దూర ప్రాంతాల నుంచి ఇసుక కోసం టిప్పర్లు, లారీలు అధికంగా వస్తున్నాయి. సీరియల్ ప్రకారం లోడింగ్ జరగడం లేదు. అధికారుల పర్యవేక్షణ సరిగా లేనట్లుంది. – ఐవల్‌రెడ్డి, లారీ డ్రైవర్, బద్వేల్

పింఛన్... టెన్షన్

- ఒక్క రోజులోనే 99 శాతం పంపిణీ చేయాలట
- సచివాలయ ఉద్యోగులపై అధికారుల ఒత్తిళ్లు

నెల్లూరు (దర్గామిట్ట): గతంలో 1వ తేదీ వస్తే వలంటీర్ల ద్వారా ఉదయం 10 గంటలలోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేసేవారు. ప్రస్తుతం 1వ తేదీ వస్తే సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీపై టెన్షన్‌కు గురవుతున్నారు. తొలిరోజే 99 శాతం పింఛన్లు పంపిణీ చేయాల్సిందేనని, ఉదయం నుంచే పంపిణీ ప్రారంభించాలని ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఆదేశాలతో ఆందోళనకు గురవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి 50 గృహాలకు ఒక వలంటీరు ఉండడంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎలాంటి ఒడిదొడుకులకు లోనుకాకుండా సజావుగా సాగేది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వలంటీర్ వ్యవస్థ సేవలను పూర్తిస్థాయిలో నిలుపుదల చేసి, పింఛన్ల పంపిణీ సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. ఒక సచివాలయం పరిధిలో ఉన్న అన్ని పింఛన్లను ఒకే రోజు 99 శాతం మేర ఎలా పంపిణీ చేయగలమంటూ వారు ఒకింత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం పరిధిలో గరిష్ఠంగా 500 నుంచి 700 మంది లబ్ధిదారులకు ఒక్కరోజులోనే పింఛను అందించాలంటే చాలా కష్టమైన విషయమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంపిణీ ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో వేరే ప్రాంతాల్లో నివాసముండే సచివాలయ ఉద్యోగులు మరింత అవస్థలకు గురవుతామని అంటున్నారు. అంతేకాక పింఛను లబ్ధిదారులు సచివాలయం పరిధిలో రెండు, మూడు పంచాయతీలలో నివాసం ఉంటారని, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు ఇచ్చేందుకు కనీసం ఒక లబ్ధిదారునికి 10 నిమిషాలు వేసుకున్నా ఒక్కరోజులో పంపిణీ పూర్తికాదని, అయితే అధికారులు మాత్రం తమను ఒక్కరోజులోనే 99 శాతం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పింఛన్ల పంపిణీకి 6,994 మంది సిబ్బంది

జిల్లాలో ఆగస్టు 1వ తేదీ 3,11,535 మందికి సామాజిక పింఛన్ల పంపిణీ కోసం 6,994 మంది సిబ్బందిని క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ చేశాం. పలు రకాల పింఛన్ లబ్ధిదారులకు మొత్తం రూ.131.68 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి తొలి రోజే 99 శాతం పూర్తి చేస్తాం. – డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీ

నెల్లూరు సిటీ: జిల్లాలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలోని పలువురు సబ్ రిజిస్ట్రార్‌లను బదిలీ చేస్తూ ఆ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోవూరు, ఆత్మకూరు, వెంకటగిరి స్థానాల్లో డిప్యుటేషన్‌పై గత కొంత కాలంగా ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్‌లను రెగ్యులర్ స్థానాలకు బదిలీ చేశారు. కోవూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్‌ను బుచ్చిరెడ్డిపాళెంకు, స్టోన్‌హౌస్‌పేట్ ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ యు శ్రీనివాసులను వెంకటగిరికి, బుచ్చిరెడ్డిపాళెం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ కోటేశ్వరరావును ఆత్మకూరుకు బదిలీ చేశారు. నెల్లూరు రీజనల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మిల్కీరోషన్‌ను స్టోన్‌హౌస్‌పేట ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా, ఆత్మకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఏబీఎస్ ప్రసాద్‌ను కోవూరు సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

మనల్ని ఎవడ్రా ఆపేది!

ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేస్తున్న టీడీపీ నాయకులు

- కల్లూరుపల్లి పెద్దచెరువులో 1.7 ఎకరాల ఆక్రమణ
- అందులో లేఅవుట్ వేసి అనుచరులకు పందేరం
- అధికారుల హెచ్చరిక బోర్డులున్నా బేఖాతరు
- చోద్యం చూస్తున్న జలవనరుల శాఖ అధికారులు

ఖాళీ స్థలం కనపడితే కబ్జా చేయడమే... అంగుళం స్థలం కనపడినా ఆక్రమించడమే.. అన్నట్లుగా మారింది నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ నాయకుల తీరు. మనల్ని ఎవడ్రా ఆపేది.. అంటూ అధికారుల హెచ్చరిక బోర్డులను సైతం లెక్కచేయకుండా తొలగించిన భూమిని ఆక్రమించిన ఘటన కల్లూరుపల్లి గ్రామ పరిధిలో చోటు చేసుకుంది.

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గం కల్లూరుపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 8లో కల్లూరుపల్లి పెద్దచెరువు ప్రాంతంలో 1.7 ఎకరాల స్థలాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఆక్రమించారు. ఈ స్థలంలో లేఅవుట్ చేసి చదును చేశారు. సుమారు 60–70 ప్లాట్లను వేశారు. 9 అంకణాల లెక్కన ప్లాట్లు సిద్ధం చేశారు. ఈ స్థలాలను స్థానిక టీడీపీ నాయకులు, తమ అనుచరులు, వర్గీయులకు కట్టబెట్టారు. టీడీపీ నేతల తీరుపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా గడవకముందే టీడీపీ నేతల తమ అసలు స్వరూపాన్ని చూపిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.



పెద్దచెరువు స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు

జలవనరుల శాఖ బోర్డుల తొలగింపు

కల్లూరుపల్లి గ్రామ పరిధిలోని పెద్దచెరువు స్థలాన్ని ఏడాదిన్నర క్రితం కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. ఆయన స్వయంగా జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జలవనరుల శాఖ అధికారులు ఆ స్థలంలో బోర్డులను ఏర్పాటు చేశారు. ఆక్రమణలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు. అయితే ఆ బోర్డులను స్థానిక టీడీపీ నాయకులు తొలగించి ఆక్రమణలకు పాల్పడడం చర్చనీయాంశమైంది.



ఆక్రమణలు చేసి లేఅవుట్‌లో ప్లాట్లు వేసిన టీడీపీ నాయకులు

రచ్చకెక్కిన సీసీ కెమెరాల గొడవ

- ఇద్దరు స్టాఫ్ నర్సుల మధ్య వివాదం
- ఏఎస్‌పేట పీహెచ్‌సీలో ఘటన

అనుమసముద్రంపేట: వైద్య సిబ్బందిలో ఐక్యత లోపించడంతో సీసీ కెమెరాల గొడవ ఎట్టకేలకు రచ్చకెక్కింది. ఏఎస్‌పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో గత కొద్ది రోజుల నుంచి సీసీ కెమెరాల ఏర్పాటుపై స్టాఫ్‌నర్సుల మధ్య గొడవ నెలకొంది. ఏఎస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొద్ది సంవత్సరాల క్రితం ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. అయితే అవి ప్రస్తుతం మరమ్మతులకు గురయ్యాయి. ఇటీవల నూతనంగా ఓ స్టాఫ్ నర్సు విధులలో చేరడమే కాక ఆమె ఓ సీసీ కెమెరాను ఏర్పాటు చేసింది. అయితే దీనికి సంబంధించిన కనెక్షన్ ఆమె భర్త సెల్‌ఫోన్‌కు ఇవ్వడంతో కొంత మంది సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రైవేట్ వ్యక్తికి వైద్యశాల విషయాలు తెలుసుకునేందుకు సీసీ కెమెరా కనెక్షన్ అతనికి ఎలా ఇస్తారని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇద్దరు స్టాఫ్ నర్సుల మధ్య వివాదం నెలకొంది. కొత్తగా వచ్చిన స్టాఫ్ నర్సు భర్త ఓ ఎలక్ట్రానిక్ మీడియాలో విలేకరి కావడంతో ఆసుపత్రిని సైతం వీరి చేతిలోకి తీసుకుని పెత్తనం చెలాయిస్తున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఈ విషయం బుధవారం డాక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



ఏఎస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కనెక్షన్ నా సెల్‌లోనే ఉంది

కొంత మంది సిబ్బంది ఆరోపిస్తున్నట్లు సీసీ కెమెరాల కనెక్షన్ ఏ ప్రైవేట్ వ్యక్తికి ఇవ్వలేదు. కేవలం డాక్టర్ల సెల్‌ఫోన్లకు మాత్రమే కనెక్షన్ ఇచ్చి రాత్రి సమయాల్లో పర్యవేక్షిస్తున్నాం. అంతే తప్ప ఎవరికీ ఇవ్వలేదు.

– డాక్టర్ మంజులమ్మ

చతుర్థ వర్ధంతి



మా ఇంటి దైవం, మాకు మార్గదర్శకులు కీ॥ శే॥ క్రైపు నాగిరెడ్డి గారు పరమపదించి తేది. 01.08.2024 నాటికి నాలుగు సంవత్సరాలు గడవనున్న సందర్భంగా ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకుంటూ...

కీ॥ శే॥ క్రైపు నాగిరెడ్డి గారు

భార్య : క్రైపు రాజేశ్వరమ్మ
కుమారుడు : క్రైపు మల్లిఖార్జున రెడ్డి
రాంజీనగర్, నెల్లూరు.
PORTLAND, USA.
మరియు కుటుంబసభ్యులు

వైఎస్‌ జగన్‌ను కలిసిన బుర్రా


జగన్‌మోహన్‌రెడ్డితో బుర్రా మధుసూదన్‌ యాదవ్‌

కందుకూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ బుధవారం తాడేపల్లి కార్యాలయంలో కలిశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం వంటి అంశాలపై చర్చించినట్లు బుర్రా తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని అధినేత సూచించినట్లు తెలిపారు.

డ్రైవింగ్‌ చేస్తూ సిమెంట్‌ కంపెనీ జీఎం మృతి


కారులోనే మృతి చెందిన ద్వారకానాథ్‌రెడ్డి

ముత్తుకూరు: కారు డ్రైవింగ్‌ చేస్తూ గుండెపోటుకు గురై జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌ కంపెనీ జీఎం మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ముత్తుకూరులో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని వద్ద లభ్యమైన ఆధార్‌ కార్డులో సమాచారం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన బాలన్నగారి ద్వారకానాథ్‌రెడ్డి (55)గా గుర్తించారు. జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌ కంపెనీలో నంద్యాల జీఎంగా పనిచేస్తున్న ఆయన కృష్ణపట్నం పోర్టులో సిమెంట్‌ లోడింగ్‌ వ్యవహారాలు చూసుకుని బుధవారం కారు డ్రైవ్‌ చేసుకుంటూ నెల్లూరు వైపు బయలుదేరాడు. ముత్తుకూరు పోస్టాఫీసు సమీపంలో కారు రోడ్డు పక్కగా అడ్డ దిడ్డంగా ఆగిపోయింది. మధ్యాహ్నం నుంచి కారు ఆన్‌లో ఉండడం, కారులో ద్వారకానాథ్‌రెడ్డి అపస్మారక స్థితిలో ఉన్నాడు. సాయంత్రం పరిశీలించగా అతను మృతి చెందినట్లు గుర్తించారు. డ్రైవింగ్‌ చేస్తుండగా గుండెనొప్పితో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. ముత్తుకూరు పోలీసులు విచారిస్తున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం : నెల్లూరు
రిచ్‌వీక్ ఎన్‌క్లేవ్, ఎ.కె. నగర్, నెల్లూరు-524004.
సవరణ
ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ దినపత్రికలో 30.07.2024 తేదిన ప్రచురితమైన ఋణగ్రహీత M/s యువంత్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అకౌంట్‌కు సంబంధించిన అమ్మకపు నోటీసులోని ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, ఇక్కడపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామము, సర్వే నెం 481/B A & 485, M/s. ఎస్‌వీఆర్‌ఆర్ రైస్ మిల్లు యొక్క ప్లాంట్ మరియు మెషినరీ, స్టాక్స్ కు బదులుగా ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, కృష్ణపట్నం పోర్టు దగ్గరనున్న M/s యువంత్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ప్లాంట్ మరియు మెషినరీ & స్టాక్స్ అని చదువుకోగలరు. సదరు ఇ-వేలం నోటీసు ప్రచురణలో మిగిలిన వివరములలో ఏ మార్పు లేదు.
తేది: 31.07.2024, ప్రదేశం: నెల్లూరు | అధీకృత అధికారి కెనరా బ్యాంక్

సొంతింటి కల్లలు

మధ్య తరగతి సొంతింటి కల.. మున్సిపాలిటీ నిర్లక్ష్యం మూలంగా కల్లలు అయ్యాయి. అటు ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తూ.. ఇటు మున్సిపాలిటీకి రాబడి తెచ్చి పెట్టే ఈ ప్రాజెక్ట్‌ను దాదాపు మూడున్నర దశాబ్దాలకు పైగా గాలికి వదిలేశారు. ప్లాట్ల కోసం తిరిగి తిరిగి ఆ కుటుంబాలు నిర్వేదంలో మునిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్‌ను మూలన పడేశారు. అక్కడ స్థలాలు కొనుగోలు చేసి, నివాసాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపాలిటీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేయడం, వసతులు కల్పించడం ద్వారా అక్కడ అద్భుత ప్రాంతం ఏర్పాటవుతోంది.

- 37 ఏళ్లుగా మధ్య తరగతి కుటుంబాల ఎదురు చూపు
- నాలుగు కేటగిరీల్లో 463 ప్లాట్ల ఏర్పాటు
- 14 మందికి రిజిస్ట్రేషన్ల పెండింగ్‌, 74 ప్లాట్లు ఖాళీ
- కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు మున్సిపాలిటీ గ్రహణం
- ప్లాట్లు కేటాయిస్తే.. మున్సిపాలిటీకి రూ.కోట్లల్లో ఆదాయం


ఐడీఎస్‌ఎంటీ లేఅవుట్‌లోని నివాసాల మధ్య కనీస రోడ్డు లేని వీధి

కావలి: ఇంటిగ్రేటెడ్‌ డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ స్మాల్‌ అండ్‌ మీడియం టౌన్‌ (ఐడీఎస్‌ఎంటీ) ప్రాజెక్ట్‌ కావలి మున్సిపాలిటీ నిర్లక్ష్యానికి, బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. పట్టణంలో అంతర్భాగంగా ఉండే ఈ ప్రాంతం అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. 37 ఏళ్లుగా వసతుల్లేక యజమానులు నరకప్రాయమైన జీవనాన్ని అనుభవిస్తున్నారు. వసతుల కల్పన కోసం కొనుగోలుదారులు, ప్లాట్ల కోసం సభ్యులు తిరిగి తిరిగి నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. ప్రభుత్వం అమలు చేసే ఏ పథకమైనా పక్కాగా అమలు కావాలంటే అధికారుల చిత్తశుద్ధే అందుకు గీటురాయి. అధికారుల్లో లోపించిన చిత్తశుద్ధి, నిర్లక్ష్యానికి ఐడీఎస్‌ఎంటీ ఉదాహరణగా నిలుస్తోంది.

పట్టణాలను విస్తరింపజేయాలనే సంకల్పంతో ప్రజలకు నివాసయోగ్యమైన కాలనీలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో 1987లో కావలిలో ప్రభుత్వం ఐడీఎస్‌ఎంటీ (ఇంటిగ్రేటెడ్‌ డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ స్మాల్‌ అండ్‌ మీడియం టౌన్స్‌) ఏర్పాటుకు అడుగులు వేసింది. పట్టణాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు వారికి ఇళ్ల స్థలాలను సమకూర్చేలా కేంద్ర ప్రభుత్వం అప్పట్లో దేశ వ్యాప్తంగా ఈ ఐడీఎస్‌ఎంటీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటి పాలకులు కావలి పట్టణంలో సర్వే నంబర్‌ 2082–2లో ఉన్న అటవీశాఖ భూమిలో 40 ఎకరాలను ఈ పథకం కింద కేటాయిస్తూ ఇళ్ల స్థలాల కోసం లేఅవుట్‌ వేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ పథకం కావడంతో అటవీ శాఖ నుంచి అన్ని అనుమతులు శరవేగంగా వచ్చాయి. దీంతో 40 ఎకరాల లేఅవుట్‌లో 20.65 ఎకరాలను ఇళ్ల స్థలాలకు, 0.46 సెంట్లు వాణిజ్య అవసరాలకు, 2.67 ఎకరాలను స్కూల్‌ పోస్టాఫీస్‌, ఆస్పత్రి, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం కోసం, 3.70 ఎకరాలు పార్కులు, ఆట స్థలం కోసం, 12.52 ఎకరాలు రోడ్లకు కేటాయిస్తూ లేఅవుట్‌ సిద్ధమైంది.

నాలుగు గ్రూపులుగా విభజించి

నివాస స్థలమైన 20.65 ఎకరాలను నాలుగు గ్రూపులుగా విభజించారు. హై ఇన్‌కం గ్రూపు (హెచ్‌ఐజీ) కేటగిరీలో 50 అంకణాల విస్తీర్ణంలో 44 ఇళ్ల ప్లాట్లు, మీడియం ఇన్‌కం గ్రూపు (ఎంఐజీ) కేటగిరీలో 37.5 అంకణాల విస్తీర్ణంలో 88 ప్లాట్లు, లోయర్‌ ఇన్‌కం గ్రూపు (ఎల్‌ఐజీ) కేటగిరీలో 33.33 అంకణాల విస్తీర్ణంలో 123 ప్లాట్లు, ఎకనామికల్లీ వీకర్‌ సెక్షన్‌ (ఈడబ్ల్యూస్‌) కేటగిరీలో 11.11 అంకణాల విస్తీర్ణంలో 214 ప్లాట్లతో లేఅవుట్‌ను సిద్ధం చేశారు. ఈ ప్లాట్లను ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు కోసం మున్సిపాలిటీలో రూ.500 చలానా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. దరఖాస్తుదారులు ఎక్కువ మంది రావడంతో లాటరీ ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారులకు ప్లాట్లు కేటాయించారు. ప్లాట్లు పొందిన వారు మున్సిపాలిటీ నిర్దేశించిన ధరల ప్రకారం చెల్లింపులు చేయగా, వారికి మున్సిపాలిటీ ఆయా ప్లాట్లను రిజిస్ట్రేషన్‌ చేసింది. 1997 వరకు 381 ప్లాట్లను దరఖాస్తుదారులకు మున్సిపాలిటీ రిజిస్ట్రేషన్లు చేయగా, ఇంకా 88 ప్లాట్లు మిగిలి ఉన్నాయి. ఈ ప్లాట్లలో మున్సిపాలిటీకి పూర్తి స్థాయిలో నిర్దేశిత చెల్లింపులు చేసినా, మున్సిపాలిటీ నిర్లక్ష్యం వల్ల 14 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఇవి పోను ఇంకా 74 ప్లాట్లు మిగిలి ఉన్నాయి. ఈ ప్లాట్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. ఇందుకోసం మున్సిపాలిటీ వద్ద 265 మంది దరఖాస్తుదారుల జాబితా 37 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. అయితే ఇప్పటి వరకు ఐడీఎస్‌ఎంటీ లేఅవుట్‌లో రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి ప్రధానమైన సౌకర్యాలు కల్పించలేదు. ఆట స్థలం, పార్కులు వంటివి నిర్మించలేదు. పాఠశాల, ఆడిటోరియం, పోస్టాఫీస్‌ ఊసేలేదు. కమర్షియల్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌ స్థలం ఆక్రమణకు గురైంది.

దాటవేత ధోరణి

ఈ నిర్దేశిత నగదు చెల్లించిన వారికి ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ చేయకుండా ముప్పతిప్పలు పెడుతున్న మున్సిపాలిటీ ఎప్పటికప్పుడు వీలు చూసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తామంటూ దాటవేత ధోరణి అవలంబిస్తూ దశాబ్దాల కాలాన్ని గడిపేసింది. ఇక ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటామని, మిగిలిన ప్లాట్లకు లాటరీ వేయాలని మున్సిపాలిటీని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ వద్ద మిగిలి ఉన్న 74 ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయించినా కోట్లాది రూపాయలు మున్సిపాలిటీకి సమకూరే అవకాశం ఉంది.



లేఅవుట్‌ ప్లాన్‌



మోహన్‌రెడ్డి జ్యూయలర్స్‌
ఆషాఢ మాసం సేల్‌
916 KDM BIS హాల్‌మార్క్‌
వడ్డాణాలు, లాంగ్‌హారాలు, నెక్‌లాకెట్స్‌, చౌకర్స్‌, గాజులు, సరుడ్లు, చైన్లు, బ్రాస్‌లెట్స్‌, నల్లపూసల దండలు, జుంకీలు, డాలర్లు, ఉంగరాలు, కమ్మలు మొదలగు॥
916 KDM BIS హాల్‌మార్క్‌
బంగారు ఆభరణములపై తరుగులు, కూలీలు, రాళ్ల ఛార్జీలు లేవు.



- 916 KDM BIS హాల్‌మార్క్‌ బంగారు ఆభరణములపై
- 1 గ్రాముకు - రూ. 500/- తగ్గింపు
- 1 సవరకు - రూ. 4000/- తగ్గింపు
- వెండి వస్తువులపై తరుగు, కూలీలు లేవు.
- డైమండ్స్‌పై 1 క్యారెట్‌కి - రూ. 5000/- తగ్గింపు
- E.F కలర్‌, VVS1 క్లారిటీ, IGI సర్టిఫికేట్‌తో ఇవ్వబడును.

ప్రతి ఆదివారం షాపు తెరచి ఉండును.
కాకర్లవారివీధి, చిన్నబజార్‌, నెల్లూరు. Ph: 0861-2327549

రూ.3 లక్షలు ఇస్తే సరి..

- రేషన్‌ షాపు రద్దు చేస్తామని డీలర్‌కు బెదిరింపులు
- ఈ విషయం సోషల్‌ మీడియాలో వైరల్‌
- చంపేస్తామనడంతో కుటుంబంతో డీలర్‌ పరారీ

కోవూరు: నీకు రేషన్‌ షాప్‌ ఉండాలంటే టీడీపీ నేత లక్ష్మీనరసారెడ్డి అలియాస్‌ బాబుల్‌రెడ్డికి రూ.3 లక్షలు ఇవ్వాలని ఆయన అనుచరులు మండలంలోని గంగవరం రేషన్‌ డీలర్‌ ముజీబ్‌ను బెదిరించారు. ఈ విషయమై ఓ దాబాలో డీలర్‌తో బేరసారాలు, బెదిరింపులకు పాల్పడిన వ్యవహారం సోషల్‌ మీడియాలో వైరల్‌ అయింది. దీంతో బాబుల్‌రెడ్డి అనుచరులు ముజీబ్‌ను కనిపిస్తే చంపేస్తామంటూ హెచ్చరించడంతో ఆయన తన కుటుంబంతో సహా కనిపించకుండా పోయాడు. వివరాల్లోకి వెళ్తే.. గంగవరం రేషన్‌ డీలర్‌గా ముజీబ్‌ ఉన్నాడు. ఆయన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు. తాజాగా అధికారం మారడంతో స్థానిక టీడీపీ నేత బాబుల్‌రెడ్డి తన అనుచరులతో రేషన్‌ షాపును లేకుండా చేస్తామని బెదిరించాడు. రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేయడం, చివరకు రూ.2 లక్షలైనా ఇవ్వాలని ఫైనల్‌ చేశారు. 'రేషన్‌ షాపు విషయంలో మేము చెప్పిందే వేదం బాబుల్‌రెడ్డి ఎన్నికల్లో చాలా ఖర్చు చేశాడు. ఆ డబ్బులు సంపాదించుకోవాలి. ఇదంతా కూడా బాబుల్‌రెడ్డి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లే చేస్తున్నాడు. ఆమెకు తెలియకుండా బాబుల్‌రెడ్డి ఏమీ చేయడు. నీ చేతిలో రేషన్‌ షాపు ఉంటే.. టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం నీ ఇష్టం వచ్చినట్లు అక్రమాలు చేసుకో' అంటూ బాబుల్‌రెడ్డి అనుచరులు ఓ దాబాలో కూర్చొని చేసిన బేరసారాలు, బెదిరింపుల వ్యవహారం సోషల్‌ మీడియా ద్వారా వైరల్‌ అయింది. ఈ విషయం తెలుసుకున్న బాబుల్‌రెడ్డి తన అనుచరులను రంగంలోకి దింపాడు. కనిపిస్తే చంపేస్తామంటూ చేసిన హెచ్చరికలు ముజీబ్‌కు చేరడంతో ఆయన తన కుటుంబంతో కలిసి కనిపించకుండా పోయాడు. ఈ విషయం బయటపడడంతో మండలంలోని రేషన్‌ డీలర్లు హడలిపోతున్నారు. ఈ రోజు ముజీబ్‌కు జరిగిందే.. మనకు జరగదని నమ్మకం ఎట్ల అని వాపోతున్నారు. బాబుల్‌రెడ్డి గతంలో జొన్నవాడ కామాక్షమ్మ ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ సభ్యుడిగా ఉన్న సమయంలో వివాదాలకు కేరాఫ్‌గా నిలిచాడు.

కోరలు చాచిన డయేరియా

- పాడేరులో 50 మందికిపైగా బాధితులు
- ఇప్పటికే మహిళ మృతి
- ఐదు రోజులుగా కొనసాగుతున్న మెడికల్‌ క్యాంపు
- విషమ పరిస్థితిలో ఉన్న వారిని నెల్లూరు, ఆత్మకూరుకు తరలింపు


పాడేరులో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

చేజర్ల : మండలంలోని పాడేరులో డయేరియా కోరలు చాచి మృత్యుఘంటికలు మోగిస్తోంది. డయేరియా బారిన పడిన ఓ మహిళ పరిస్థితి విషమించి గత శుక్రవారం మరణిస్తే.. ఆమె గుండెపోటుతో మరణించినట్లు వైద్యాధికారులు దాట వేస్తున్నారు. డయేరియాను ఐదు రోజులుగా అదుపులోకి తీసుకురావడంలో వైద్యారోగ్యశాఖ విఫలమవుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో బాధితులను మెరుగైన వైద్యానికి నెల్లూరు జీజీహెచ్‌, ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి, పొదలకూరు సీహెచ్‌సీలకు తరలించారు. దీన్ని బట్టి గ్రామంలో డయేరియా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. చేజర్ల పీహెచ్‌సీ వైద్యురాలు మెహతాబ్‌ పర్యవేక్షణలో గ్రామంలో మెడికల్‌ క్యాంప్‌ నిర్వహిస్తున్నారు. ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. కానీ డయేరియా మాత్రం అదుపులోకి రాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. వైద్యురాలు మెహతాబ్‌ మాట్లాడుతూ పాడేరు గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కారణంగా వాతావరణం ప్రభావంతో విజృంభించిందన్నారు. గ్రామంలో డయేరియా కేసు నమోదైనప్పటి నుంచి మెడికల్‌ క్యాంప్‌ ప్రారంభించామని, ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. విషమంగా ఉన్న వాళ్లను మెరుగైన వైద్యానికి నెల్లూరు, ఆత్మకూరు, పొదలకూరుకు తరలించామన్నారు. ప్రాథమిక దశలో ఉన్న వాళ్లకు ఇక్కడే వైద్య సేవలందిస్తున్నారు.

విఫలమైన ప్రభుత్వ యంత్రాంగం

వారం రోజులుగా పాడేరు పరిశుభ్రత లోపించి డయేరియా ప్రబలి ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంటే.. ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచిన దాఖలాలు కనిపించడం లేదు. కేవలం వైద్య శిబిరం పెట్టి వైద్య సేవలు అందిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. డయేరియా మరణాన్ని కూడా అధికారులు సహజ మరణాలుగా లెక్కించి వ్యాధి తీవ్రతను తక్కువగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేల్కొకపోతే పరిస్థితి అదుపు తప్పి మరణ మృదంగానికి దారి తీసే పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిధుల్లో ప్రతి రూపాయికి బాధ్యత నాదే

- 18న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సమావేశం
- నూతన కమిటీ ప్రమాణ స్వీకారం నిబంధనలకు విరుద్ధం
- దేవస్థానం గౌరవ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్‌



నెల్లూరు (బృందావనం): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో కొలువైన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి సంబంధించిన నిధుల్లో ప్రతి రూపాయికి తానే బాధ్యత అని, ఒక్క రూపాయి అవినీతి జరిగినా తనను నిలదీయాలని, తప్పులుంటే ఆత్మార్పణకు సిద్ధమని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నేత, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్‌ స్పష్టం చేశారు. కొందరు ఆర్యవైశ్యులు అధికార బలంతో బైలా నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరించి దుందుడుకు చర్యలతో ఆర్యవైశ్య సంఘీయుల, భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ పోలీసు బలగాలను అడ్డుపెట్టుకుని ముక్కాల ద్వారకానాథ్‌ను గృహ నిర్బంధం చేసి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గందరగోళానికి తెర లేపారు. తమకే అధికారం ఉందంటూ బుధవారం నూతన ఆలయ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఘటనపై ముక్కాల ద్వారకానాథ్‌ నవాబుపేటలోని తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార దాహంతో పవిత్రమైన అమ్మవారి సన్నిధిని అపవిత్రం చేసి ఆర్యవైశ్యసంఘీయుల మనోభావాలు దెబ్బతీసి ఆలయ నూతన కమిటీగా ప్రకటించుకున్న వారికి ఎట్టిపరిస్థితుల్లో దేవస్థానం బాధ్యతలను అప్పగించేదేలేదని స్పష్టం చేశారు. ఆలయ పునః నిర్మాణానికి సుమారు 4 వేల మంది సభ్యులు, మరో 500 మంది దాతలు అందించిన సహకారం, విరాళాలతో 2018లో చేపట్టామన్నారు. అమ్మవారి దేవస్థానానికి వచ్చిన నిధుల్లో ఒక్క రూపాయి అవినీతి జరిగినట్లు నిరూపిస్తే.. ఏ శిక్షకైనా తాను సిద్ధమన్నారు. వినియోగించిన ప్రతి రూపాయికి తాను లెక్క చెబుతానని ముక్కాల ద్వారకానాథ్‌ తెలిపారు. బైలా నిబంధనల మేరకు 18న జరిగే సర్వసభ్య సమావేశం సందర్భంగా నిధుల వివరాలను ఆడిటర్ల ద్వారా వివరిస్తామన్నారు. ఎవరైనా ఇతర ఆడిటర్లను తీసుకురావచ్చన్నారు. దుర్మార్గంగా తనను హౌస్‌ అరెస్ట్‌ చేసి, కేవలం 10 మంది కలిసి నూతన కమిటీ ఏర్పాటు చేసుకోవడం కరెక్ట్‌ కాదన్నారు. పది మందితో ఏర్పాటైన కమిటీకి ఆలయ నిధులను అప్పగించే ప్రసక్తే లేదన్నారు.

క్రీడా పోటీలకు జట్ల ఎంపిక రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): విద్యుత్‌ ఉద్యోగుల ఇంటర్‌ సర్కిల్‌ క్రీడాపోటీలకు జట్ల ఎంపిక శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్‌ జిల్లా స్పోర్ట్స్‌, గేమ్స్‌ సెక్రటరీ ఆర్‌.వేలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో శ్రీశైలంలో ఆగస్టు 7 నుంచి 9వ తేదీ వరకు బాల్‌ బ్యాడ్మింటన్‌, బ్రిడ్జ్‌ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే ఏపీఎస్పీడీసీఎల్‌ నెల్లూరు జిల్లా సర్కిల్‌ పరిధిలో పని చేస్తున్న రెగ్యులర్‌ ఉద్యోగులు, జూనియర్‌ లైన్‌మెన్‌ గ్రేడ్‌–2 ఉద్యోగులు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్‌భవన్‌లో నిర్వహించే ఎంపికలకు హాజరు కావాలని, ఇతర వివరాలకు 90308 02038, 98660 70775 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలన్నారు.


పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.65
సన్నవి : రూ.45
పండ్లు : రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌ లైవ్‌ :	రూ.112
లేయర్‌ లైవ్‌ :	రూ.95
బ్రాయిలర్‌ చికెన్‌:	రూ.206
స్కిన్‌లెస్‌ చికెన్‌:	రూ.230
లేయర్‌ చికెన్‌:	రూ.162



సామాజిక పింఛన్లకు కోత?

- ఈ నెలలో 4,466 మందికి తొలగింపు


గత నెలలోనూ పింఛన్ల కోసం బ్యాంకుల వద్దపడిగాపులు పడిన వృద్ధులు (ఫైల్‌)

ఆత్మకూరు: సామాజిక పింఛన్లకు కొత్త ప్రభుత్వం కోత విధించడం ప్రారంభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం జూన్‌ నెలలో కూడా 3.17 లక్షల మందికిపైగా పింఛన్లు పంపిణీ చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్షలతో చాలా మందికి జూలై పింఛన్లు ఇవ్వకుండా ఆపేసింది. ఆ నెలలో జిల్లాలో 3,16,001 మందికి పింఛన్లు పంపిణీ చేయడానికి నిర్దేశించినప్పటికీ పూర్తి స్థాయిలో పంపిణీ జరగలేదు. తాజాగా ఆగస్టు 1న పంపిణీ చేయనున్న పింఛన్ల జాబితా పరిశీలిస్తే.. ఈ నెలలో 3,11,535 మందికే పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ లెక్కన ఈ నెల్లో దాదాపు 4,466 మంది పింఛన్లకు కోత పెట్టినట్లు స్పష్టమవుతోంది. గత ప్రభుత్వంలో ప్రతి జూన్‌, డిసెంబరు నెలలో కొత్త పింఛన్లను పెంచుతూ వచ్చింది. అయితే ఈ ఏడాది కూడా జనవరి నుంచి నమోదు చేసుకున్న కొత్త పింఛన్‌ దారులకు జూన్‌ నుంచి పింఛన్‌ మంజూరు చేసి ఇవ్వాల్సి ఉంది. కానీ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో కొత్త పింఛన్ల సంగతి దేవుడు ఎరుగు... ఉన్న పింఛన్లకు కోత పెట్టింది. గత రెండు నెలలను పరిశీలిస్తే.. గత నెల్లో 2 వేల మందికి కోత పెట్టగా, ఈ నెలలో 4,466 మందికి కోత పెట్టింది. ఈ రెండు నెలల్లోనే దాదాపు 6,500 పింఛన్లు తొలగించడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం ఐదు రోజుల పాటు పింఛన్ల పంపిణీ చేస్తే.. కొత్త ప్రభుత్వం కేవలం రెండు రోజులే గడువు పెట్టి పంపిణీ చేస్తోంది. సామాజిక పింఛన్లపై ఆధారపడిన ఎందరినో ఎన్నికల నెపంతో ఇంటింటికి పింఛన్ల పంపిణీపై అప్పటి ప్రతిపక్ష టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఇబ్బందులకు గురి చేసింది. ఒక నెలలో సచివాలయాలకు పరుగులు పెట్టించగా, మరసటి రెండు నెలలు బ్యాంక్‌ల్లో జమ చేసి మరింత ఇబ్బందుల పాల్జేసింది. దీంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం కావడంతో అభాగ్యులపై ప్రేమ కురిపిస్తూ.. పింఛన్‌ రూ.4 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఇలా నెల నెలా కోతలు పెడుతోంది.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

నెల్లూరు (లీగల్‌): భార్యను వేధించి ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి కారణమయ్యాడని నమోదైన కేసులో నిందితుడు భర్త షేక్‌ ఖాదర్‌మస్తాన్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా (మహిళ) కోర్టు న్యాయమూర్తి జి. గీత బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ కథనం మేరకు.. ఆత్మకూరు మండలం అశ్వనిపురం గ్రామానికి చెందిన షేక్‌ లాల్‌బీబీకి పొదలకూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన షేక్‌ ఖాదర్‌మస్తాన్‌తో 2014 అక్టోబరు 25న వివాహం జరిగింది. కట్నకానుకల కింద రూ.1.50 లక్షల నగదు, 20 సవర్ల బంగారం ఇచ్చారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొద్ది రోజుల తర్వాత ఖాదర్‌ మస్తాన్‌ కువైట్‌లో డ్రైవర్‌గా పని చేయడానికి వెళ్లి అక్కడ ఉండలేక తిరిగి డిసెంబర్‌ 2015 సొంతూరికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఖాదర్‌మస్తాన్‌ అదనపు కట్నం తెమ్మని భార్యను మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడ్డారు. భర్తతో పాటు అత్త, మామ, బావ కూడా వేధింపులకు గురి చేయడంతో ఈ విషయాన్ని లాల్‌బీబీ తన తల్లిదండ్రులకు 2016 మే 16 ఉదయం ఫోన్‌ ద్వారా చెప్పింది. అదే రోజు సాయంత్రం భర్త మరోసారి వేధించడంతో ఆమె రాత్రి 9.30 గంటల సమయంలో సూపర్‌ వెస్మాల్‌ 33 లిక్విడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను పొదలకూరులోని ఓ ప్రైవేట్‌ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మరుసటి రోజు ఉదయం మృతురాలు తల్లి రసూల్‌ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొదలకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం పోలీసులు భర్త ఖాదర్‌మస్తాన్‌, అత్త మెహరున్నిసా, మామ రహంతుల్లా, బావ రసూల్‌పై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌ షీట్‌ దాఖలు చేశారు. విచారణలో మొదటి నిందితుడు ఖాదర్‌మస్తాన్‌ పై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష విధించారు. మిగతా ముగ్గురు నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసు కొట్టి వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ తరఫున స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ సాదు ప్రసాద్‌ వాదించారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

EDUCATION

DIRECT FINAL YEAR

APOSS (Open School) ద్వారా ఒకే సం॥లో 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్‌ పూర్తి చేసుకొనే అవకాశం. సంప్ర : SVR కాలేజ్‌, చాకలి వీధి, నెల్లూరు. సెల్‌ : 8121888335, 9177951600. [NA-11172]

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/lateral entry.9381287629 [T-2215]

REAL ESTATE

LAND FOR SALE

నెల్లూరు to చెన్నై హైవేకి ఓజిలి సెంటర్‌ వద్ద 3ఎకరాల 15సెంట్లు LAND అమ్మకానికి కలదు. వివరములకు సంప్రదించండి: 99499 21853, 93908 45455. [NA-23654]

TO-LET

RTC బస్టాండ్‌ వెనుక శోధన్‌ నగర్‌, నెల్లూరులో గ్రౌండ్‌ ఫ్లోర్‌లో అన్ని వసతులతో కూడిన డబుల్‌ బెడ్రూం హౌస్‌ రెంట్‌కి కలదు. కాంటాక్ట్‌ నెంబర్‌ : 9848179650. [C-800343]

SERVICES

BUSINESS OFFER

స్నాక్స్‌, బిస్కెట్స్‌ మా ఇతర ప్రొడక్ట్స్‌కు మినిమమ్‌ పెట్టుబడితో సొంత మార్కెటింగ్‌ అనుభవం గల "డీలర్స్‌" కావలెను. సంప్ర॥ ✆ 76609 88875, 78010 01665. [O-793746]

WANTED

Wanted Teachers to Teach Maths Subject 2nd to 6th Classes. Salary: 10,000 to 12,000. Contact: 84998 16075. [NA-11170]

హోటల్‌లో పని చేయటం కొరకు వంట మాస్టర్స్‌ కావలెను. అడ్రస్‌ కదిరి, 9052119115 [C-1254040]

ఆసియా మొబైల్స్‌ యాక్సెసరీస్‌ షాపు నందు (లస్సీసెంటర్‌,ట్రంకురోడ్డు దగ్గర)పని చేయుటకు సేల్స్‌గర్ల్స్‌ కావలెను. విద్యార్హత : ఇంటర్‌ or 10th పాస్‌, మంచి జీతం. సంప్ర: 93471 10899. [NA-671]

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ప్రారంభించు బ్రాంచీల కొరకు బ్రాంచి మేనేజర్లు, క్లర్కులు, ఆఫీస్‌ స్టాఫ్‌ కావలెను. అమరావతి మ్యారేజ్‌ బ్యూరో, కావలి. సెల్‌:87902 75481, 94941 46145(వాట్సప్‌). [N-1246144]

నెల్లూరు, ఆదిత్య ఎనర్జీ సోలార్‌ కంపెనీ నందు పని చేయుటకు ఎక్స్‌పీరియన్స్‌ గల సేల్స్‌ & మార్కెటింగ్‌ సిబ్బంది కావలెను. ఆకర్షణీయమైన జీతం. సెల్‌ : 99123 66548. [NA-11173]

నెల్లూరు, హరనాథపురం మెయిన్‌ రోడ్‌లో AMR పెట్రోల్‌ బంకు నందు డే & నైట్‌ షిఫ్ట్‌లో పని చేయుటకు యువకులు కావలెను. జీతం: 13,000/-.సంప్ర:8985264143, 9494797343. [NA-6539]

వాచ్‌మెన్‌ కావలెను. ప్రగతి చారిటీస్‌, నెల్లూరు నందు పని చేయుటకు నైట్‌ వాచ్‌మెన్‌ కావలెను. జీతం: 9000/-. వివరాలకు సంప్రదించండి. సెల్‌ : 94902 49760. [NA-6540]

ప్రముఖ ఇనిస్టిట్యూట్‌ నందు ఇంగ్లీష్‌ బోధించుటకు అనుభవజ్ఞులైన ట్యూటర్స్‌ కావలెను మరియు లేడీ రిసెప్షనిస్టు కావలెను. కందుకూరులో సంప్ర॥ ✆ 76010 04697. [O-793744]

నెల్లూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు లేడి సెక్యూరిటీ గార్డ్స్‌ మరియు A.S.O.లు అర్జెంట్‌గా కావలెను. మంచి జీతం. సంప్ర – 85004 05004, 89854 22255 [G-1245731]

PASSPORT LOST

I, SHAIK IMAM BASHA, S/o. CHINA MOWLALI, Residing at 28-8-54, Simhapuri Colony, Near Prasanthi Nagar, Nellore, AP. I have lost my Passport bearing No. T8795915 While I was Travelling by bike to Stonehouspeta. If anyone found Please inform to the above address or Cell: 94409 92073

కస్టబ్రైర్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్‌ కావలెను. జీ: 15000-40000,ఫ్రీ రూం+భోజనం.HYD.Ph: 6309020999 [HA-432]

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్‌ వైజర్స్‌, నర్సులు, కాంపౌండర్స్‌, ఆయాలు, హౌస్‌కీపింగ్‌ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14415]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్‌ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.